నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సీఎం, డిప్యూటీ సీఎంలను పెంచి పోషించిన

- భట్టి ఛాంబర్‌లో పీఎస్సార్ వ్యాఖ్యలు
- నెట్టింట వైరల్

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలను తానే పెంచి పోషించానంటూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అసంతృప్తి వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం ఛాంబర్‌లో గురువారం ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల య్యాయి. 'భట్టి, రేవంత్, నేను ఒకేసారి ఎమ్మెల్సీలు అయ్యాం. ఒకాయన ముఖ్యమంత్రి, మరొకాయన ఉపముఖ్యమంత్రి అయ్యారు. నేను మాత్రం ఛాంబర్ల చుట్టూ తిరుగుతున్న. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా ఆదిలాబాద్ జిల్లా రాష్ట్ర మ్యాప్‌లో ఉండడం లేదు. అప్పుడు కాంగ్రెస్ పాలనలోనే జిల్లాను పక్కనపె ట్టారు. మళ్లీ ఇప్పుడు అలాగే జిల్లాను పక్కన పెట్టారు. మల్లికార్జున ఖర్గే మంచిర్యాల సభలో రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులిస్తామని ప్రకటించారు. దాన్ని ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు.' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వాట్సాప్‌లో చక్కర్లుకొట్టాయి. ఎమ్మెల్యేగా గెలిచాక కూడా కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నోటి దురుసు తగ్గలేదని, ఎంత మంత్రి పదవి దక్కకపోతే మాత్రం ఇలా మాట్లాడుతారా అంటూ జనం చర్చించుకుంటున్నారు.

గాంధీనగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో నిలిచిన మురుగు నీరు

ఇసుకాసురులు

కృత్రిమ కొరతతో అక్రమార్కులకు కాసుల వర్షం

- తక్కువ సంఖ్యలో క్వారీలకు అనుమతి
- ఇదే అదనుగా జోరుగా దందా.. బహిరంగ ప్రదేశాల్లో డంపులు
- ఒకే చలాన్‌తో 10 నుంచి 20 ట్రిప్పులు రవాణా
- అనుమతి లేని ప్రాంతాల నుంచి యథేచ్ఛగా తరలింపు
- చోద్యం చూస్తున్న టీఎస్‌ఎండీసీ, స్థానిక సంస్థల అధికారులు

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇసుక కృత్రిమ కొరత అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. తక్కువ సంఖ్యలో క్వారీలకు అనుమతి ఇవ్వడంతో ఇసుక దొరకడమే బంగారమైపోయింది. ఉమ్మడి జిల్లాలోని.. ఒక్క మంచిర్యాల మినహా మిగిలిన జిల్లాల్లో ఎక్కడా అధికారికంగా క్వారీలకు పర్మిషన్ లేదు. టీఎస్‌ఎండీసీ పరిధిలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూర్, జైపూర్ మండలం వేలాల క్వారీలతో పాటు స్థానిక సంస్థల పరిధిలో చెన్నూర్ బతుకమ్మ వాగు, నెన్నెలలోని ఖర్జి వాగు, హాజీపూర్ మండలం వేంపల్లి గోదావరి నుంచి ఇసుక తవ్వేందుకు అనుమతులు ఉన్నాయి. వాస్తవానికి ఈ సీజన్‌లో కోటపల్లి మండలం బోరంపల్లి, ఎర్రాయిపేట, చెన్నూర్ చింతలపల్లితో పాటు క్వారీ అన్నింటికీ అనుమతులు ఇచ్చేవారు. ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో ఒక రీచ్ నడిచేది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం ఎక్కడా లేదు. దీంతో ఇసుక కోసం మంచిర్యాల జిల్లాపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తున్నది. దీనికితోడు ఈ సారి క్వారీల సంఖ్య తగ్గించడంతో ఇసుక కోసం జనాలు వేతకాల్సి వస్తున్నది. ఇదే అదునుగా భావించి కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లు, లారీలతో ఇసుక అక్రమ రవాణాకు తెగపడుతున్నారు.

యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు..

పర్మిషన్ ఉన్న క్వారీలతో పాటు అనుమతి లేని ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. టీఎంఎండీసీ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం కోటపల్లి మండలం కొల్లూర్‌లో మాత్రమే అనుమతులతో ఇసుక తీయాల్సి ఉంది. కానీ ఎర్రాయిపేట క్వారీలో ప్రతి రోజూ వందల సంఖ్యలో లారీలు ఇసుక తవ్వుకొని వెళ్తున్నాయి. చెన్నూర్ మొదలుకొని.. ఇందారం వరకు గోదావరి పొడవునా ఈ అక్రమ దందా జోరుగా సాగుతున్నది. దీంతో పాటు జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు, పాత మంచిర్యాల, చెన్నూర్‌లోని సుద్దాల వాగు, భీమారం గొల్లవాగు, వేమనపల్లిలోని నీల్వాయి వాగుల్లో ఎక్కడపడితే అక్కడ.. ట్రాక్టర్లు పెట్టి పగలూ.. రాత్రీ తేడా లేకుండా ఇసుక తోడేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోనూ ఈ దందా నడుస్తున్నది. నిర్మల్, సారంగాపూర్, సోన్ మండలాల్లో ప్రవహించే స్వర్ణ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అలాగే ఖానాపూర్ మండల పరిధిలోని రాజుర, మందపల్లి గ్రామాల మీదుగా వెళ్లే పలికెరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా నడుస్తున్నది. ఆసిఫాబాద్‌లో కుమ్రం భీం ప్రాజెక్టు, ప్రాణహిత ప్రాంతాల్లో ఎక్కడా ఇసుక మేటలు కనిపించినా అక్రమార్కులు వదలకుండా తరలించుకొని వెళ్తున్నారు.

ఎర్రాయిపేట క్వారీ నుంచి పట్టపగలే లారీల్లో ఇసుక తరలించుకొని వెళ్తున్న దృశ్యం

ఇలా అక్రమ మార్గంలో తీసుకువచ్చిన ఇసుకను ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ డంపు చేస్తున్నారు. పొలాలు, వ్యవసాయ భూములు, పట్టణ ప్రాంతాల్లో ఇండ్ల మధ్య ఖాళీ స్థలాల్లో ఇసుక కుప్పలు తెచ్చి పోస్తున్నారు. సీజన్‌లో తెచ్చిపోసే ఈ ఇసుకను అన్‌సీజన్‌లో ఎక్కువ ధరలకు అమ్ముకుంటారు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం కొసమెరుపు.

పర్మిషన్ ఉన్న దగ్గరే జోరుగా దందా..

అనుమతులు లేని ప్రాంతాల నుంచి ఇసుక తరలించుకొని వెళ్లడం ఒకటైతే.. అనుమతులు ఉన్న దగ్గర మామూళ్ల మత్తులో మునిగిపోయిన అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు తెరలేపుతున్నారు. ఒక ట్రిప్పునకు పర్మిషన్ తీసుకొని ఆ చలాన్‌తో 10 నుంచి 20 ట్రిప్పులు కొడుతున్నారు. స్థానిక సంస్థల పరిధిలో నడిచే ట్రాక్టర్లలో ఈ వ్యవహారం నిత్యకృత్యంగా మారిపోయింది. ఇక లారీల సంగతైతే చెప్పాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు టీఎస్‌ఎండీసీ ద్వారా ఆన్‌లైన్‌లో జనరేటైన ఒక చలాన్‌ను పరిశీలించినప్పుడు సాయంత్రం 4 గంటలకు పర్మిషన్ ఇచ్చినట్లు అందులో ఉంది. కానీ 4.10 గంటలకు ఆ లారీ భీమారం మండల కేంద్రం మీదుగా వెళ్తుంది. 10 నిమిషాల్లో ఆ లారీ 26 కిలోమీటర్ల దూరం ఇసుక లోడ్ నింపుకొని, అంత హెవీలోడ్‌లో ఎలా వచ్చిందనేది అర్థం కాలేదు. అంటే పర్మిషన్ రావడానికంటే ముందే ఇసుక లోడ్ చేసి ఉండాలి.. లేదా చూపిస్తున్న చలాన్ ఫేకైనా అయి ఉండాలి. ఈ ఒక్క ఉదాహరణ చాలు అధికారుల సహకారంతో ఇసుక దందా ఏ రేంజ్‌లో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అంతా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని పైపైకి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారుల దందా ఈ తరహాలో కొనసాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా ప్రశ్నించినప్పుడు లేదా పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు హడావుడి చేసి రెండు, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి వదిలేయడం తప్ప అంతకుమించి అధికారులు చేసేదేం లేదని జనం మండిపడుతున్నారు.

అవసరముంటే క్వారీలు పెంచుతాం

జిల్లాలో ఇసుక అవసరాల కోసం స్థానిక సంస్థల ఆధ్వర్యంలో మూడు క్వారీలను ప్రారంభించాం. అవసరముంటే మరిన్ని పెంచుతాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే ఇసుక తరలించేందుకు అనుమతి ఇస్తున్నాం. వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. అనుమతులు లేని ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా విషయం నా దృష్టికి రాలేదు. వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- బాలునాయక్, జిల్లా మైనింగ్ అధికారి, మంచిర్యాల

విహారయాత్రలో కౌన్సిలర్లు..
సమస్యల్లో వార్డులు

- గోవా, విజయవాడ అంటూ టూర్లు
- అమ్ముడుపోయారంటూ మండిపడుతున్న జనం

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అధికార గర్వంతో కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు పెట్టిన సంగతి తెలిసిందే. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ అనంతరం కౌన్సిలర్లను క్యాంప్‌లకు తరలించారు. ఈ క్రమంలో మంచిర్యాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు దాదాపు 20 మంది కుటుంబాలతో సహా గోవాకు వెళ్లారు. కొన్ని రోజులుగా అక్కడే ఎంజాయ్ చేస్తున్నారు. శుక్రవారం మంచిర్యాల వచ్చి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. నస్పూర్ మున్సిపల్ కౌన్సిలర్లు విజయవాడకు, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు తీర్థయాత్రలకు వెళ్లి తిరిగి వచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. గెలిపించిన ప్రజలు మాత్రం కౌన్సిలర్లపై మండిపడుతున్నారు. మా ఓట్లతో గెలిచి లక్షల రూపాయలకు అమ్ముడుపోయారని, అధికార దాహంతో ఆగలేక వేరే పార్టీలోకి మారారని మండిపడుతున్నారు. నెలల తరబడి వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలను గాలికివదిలేసి టూర్లకు పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని వార్డుల్లో నెలల తరబడి పేరుకుపోయిన సమస్యలపై 'నమస్తే తెలంగాణ' దృశ్యమాలిక.

వికాస్‌నగర్‌లో ఇండ్ల మధ్య నిలిచిన మురుగునీరు

బైపాస్ రోడ్డులో నెలల తరబడి పూడ్చకుండా వదిలేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్

మంచిర్యాల పట్టణంలోని ఫ్లైఓవర్ దగ్గర పేరుకుపోయిన చెత్త

పత్తి అమ్మేందుకు అష్టకష్టాలు

మార్కెట్ కార్యాలయం ఎదుట టోకెన్ల కోసం బారులుదీరిన వాహనాలు

చెన్నూర్, ఫిబ్రవరి 8 : చెన్నూర్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లలో జాప్యమవుతున్నది. సీసీఐ సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు పత్తిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల నుంచి నిత్యం వాహనాలు తరలివస్తుండగా, కొనుగోళ్లు చేపట్టకపోవడంతో టోకెన్లు తీసుకొని రెండు, మూడు రోజులు క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తున్నది. దీంతో రైతులపై వెయిటింగ్ ఛార్జీల భారం పడుతుంది. సీసీఐ వారు కొనుగోలు చేసిన పత్తిని వరలక్ష్మీ, ఆదిశంకరాచార్య, చెన్నూర్ కాటన్, జీఆర్‌ఆర్ కాటన్ మిల్లుల్లో మిల్లింగ్ చేస్తున్నారు. మిల్లుల్లో పత్తిని నిల్వ చేసేందుకు స్థలం లేదనే కారణంతో సేకరణలో ఆలస్యం చేస్తున్నారు. మరోవైపు రైతులను ఇబ్బందులకు గురిచేస్తే విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తారనే ఉద్దేశంతోనే ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వ్యాపారులతో కుమ్మక్కవ్వడం వల్లే సక్రమంగా పత్తిని కొనుగోలు చేయడం లేదని, ఇకనైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. కాగా, ప్రభుత్వం క్వింటాలుకు రూ 6,920 గిట్టు బాటు ధర కల్పించగా, ప్రైవేట్ వ్యాపారులు రూ. 6,400 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్,ఫిబ్రవరి 8 : వేసవి సమీపిస్తున్నందున మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్‌లు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో ఇంజినీరింగ్, మున్సిపల్ కమిషనర్‌లు ప్రణాళికాబద్ధంగా నీటిని సరఫరా చేయాలన్నారు. ఆస్తి, ఇతర పన్నులు 100 శాతం వసూలయ్యేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కనెక్షన్‌ల కోసం ఇంటింటికీ తిరిగి వివరాలు పరిశీలించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జాతీయ విపత్తుల ప్రతిస్పందన బృందం 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, 10వ బెటాలియన్ విజయవాడ ఇన్‌స్పెక్టర్ బీటన్ సింగ్, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్యతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్ చేయడం వల్లప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. విపత్తుల సమయంలో యువత స్వచ్ఛందంగా ముందుకు సాయమందించాలని కోరారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బెటాలియన్‌ప్రతినిధులు గ్యాస్ సిలిండర్ ద్వారా అకస్మాత్తుగా మంటలు వ్యాపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, జిల్లాఅగ్నిమాపక శాఖ అధికారిఅజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పడియోరుకు వేళాయే..

నేటి అర్ధరాత్రి మహాపూజకు ముస్తాబైన నాగోబా ఆలయం

- ఆదివాసుల అతిపెద్ద పండుగకు సర్వం సిద్ధం చేసిన మెస్రం వంశీయులు
- ఆదివాసీ గిరిజనుల సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాట్లు
- 9 నుంచి 15వ తేదీ వరకు జాతర.. 12న ప్రజాదర్బార్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 8 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గల నాగోబా(పడియోరు) జాతరకు వేళయింది. నేడు(శుక్రవారం) పుష్యమాసంలో వచ్చే అమావాస్య కావడంతో అర్ధరాత్రి నాగోబాకు మెస్రం వంశీయులు మహాపూజ నిర్వహించడంతో జాతర ప్రారంభమవుతుంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు వద్ద గల గోదావరి(హస్తలమడుగు) నుంచి గంగాజలాన్ని(ఝరి) తీసుకొచ్చారు. ఈ జలంతో శుక్రవారం అర్ధరాత్రి మహాపూజలో భాగంగా నాగోబాకు అభిషేకం చేస్తారు. దీంతో జాతర అధికారికంగా ఏడు రోజుల పాటు కొనసాగుతుంది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు. విదేశాల నుంచి పర్యాటకులు, సందర్శకులు వచ్చి దర్శించుకుంటారు. ఇప్పటికే గంగాజలంతో మర్రిచెట్ల వద్ద మెస్రం వంశీయులు కుటుంబ సమేతంగా ఐదు రోజులపాటు బస చేశారు. నేటి సాయంత్రం సంప్రదాయబద్ధంగా ఎడ్లబండ్లలో గోవాడ్‌కు చేరుకుంటారు. రాత్రి ఆలయాన్ని పవిత్ర గంగాజలంతో శుద్ధి చేసి నాగోబాకు అభిషేకం చేస్తారు. నైవేద్యం సమర్పించి మహాపూజ నిర్వహిస్తారు. ఆలయంలో ఏడు రకాల పాముల పుట్టలను తయారు చేస్తారు. వీటికి ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకుంటారు. దీంతో నాగోబా అనుగ్రహం కలుగుతుందని మెస్రం వంశీయుల తోపాటు ఆదివాసీ గిరిజనుల నమ్మకం. కాగా, ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

నాగోబా చరిత్ర..

కేస్లాపూర్ నాగోబా జాతరకు ఘనమైన చరిత్ర ఉంది. క్రీ.శ.740లో కేస్లాపూర్ గ్రామ గిరిజనుడు పడియోరు శేషసాయి అనే నాగ భక్తుడు నాగదేవతను దర్శించుకోవడానికి నాగలోకానికి వెళ్లాడు. అక్కడ ద్వారపాలకులు అడ్డగించి నాగరాజు లేరని చెబుతారు. శేషసాయి నిరుత్సాహంతో నాగరాజు శేషతల్పం తాకి వెనుదిరుగుతాడు. దానధర్మాలు చేయడం ప్రారంభిస్తాడు. లోక సందర్శనం ముగించుకున్న నాగరాజు శేషతల్పంపై ఆసీనుడవుతాడు. శేషతల్పాన్ని మానవుడు తాకిన విషయం తెలుసుకుని నాగేంద్రుడు ఆగ్రహిస్తాడు. శేషసాయిని అంత మొందించేందుకు భూలోకానికి వస్తాడు. గమనించిన శేషసాయి ప్రాణభీతితో కాలజ్ఞాన పురోహితుడు ప్రధాన్ పడమార్ దగ్గరకు వెళ్తాడు. నాగరాజును శాంతిపజేసే మార్గాన్ని తెలుసుకుంటాడు. ఏడు కడవల ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, బెల్లం, పెసరపప్పు వంటి ఏడు రకాలతో నైవేద్యం సమర్పిస్తాడు. గోదావరి వద్ద గల హస్తలమడుగు నీటిని 125 గ్రామాల మీదుగా ప్రయాణించి ఆ గంగాజలంతో నాగరాజును అభిషేకిస్తాడు. దీంతో కేస్లాపూర్ వద్ద ఉన్న పుట్టలోకి నాగరాజు వెళ్లి అక్కడే తన నివాసంగా మార్చుకుంటాడు. అప్పటి నుంచి యేటా పుష్యమాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మెస్రం వంశీయులు నాగోబాకు మహాపూజ నిర్వహిస్తున్నారు.

మెస్రం వంశీయులే అర్చకులు..

నాగోబా దేవతకు మెస్రం వంశీయులే అర్చకులుగా వ్యవహరిస్తూ మహాపూజ నిర్వహిస్తారు. మెస్రం వంశంలో 22 తెగలు ఉన్నాయి. ఇందులో ఏడుగురు దేవతలను కొలిచేవారంతా మెస్రం వంశస్తులు. మడావి, మర్సుకోల, పుర్కా, మెస్రం, వెడ్మ, ఫంద్రా, ఉర్వేత ఇలా ఇంటిపేర్లు గలవారు మెస్రం వంశంలోకి వస్తారు. కాగా.. వీరు మహాపూజ నిర్వహించిన అనంతరం ఇతరులు నాగోబాను దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇది మెస్రం వంశీయుల సంప్రదాయం.

గోవాడ్‌లో 22 పొయ్యిలపై వంటలు..

మెస్రం వంశానికి చెందిన మహిళలు వంటలు చేయడానికి గోవాడ్‌లో 22 పొయ్యిలను ఏర్పాటు చేస్తారు. మహాపూజకు కావాల్సిన నైవేద్యాలు వండుతారు. గోవాడ్‌లో ఇతరులు రాకుండా నిబంధనలు విధిస్తారు. వందలాది మంది మెస్రం వంశస్తుల మహిళలు వంతులవారీగా వంటలు చేస్తారు.

గర్భగుడిలోని నాగోబా విగ్రహం

దర్బార్ ప్రత్యేకత..

జాతర సందర్భంగా యేటా నిర్వహించే దర్బార్‌కు ప్రత్యేకత ఉంది. 78 ఏండ్ల క్రితం మారుమూల గ్రామాలకు సౌకర్యాలు లేవు. గిరిజనుల వద్దకు అధికారులు వచ్చేవారు కాదు. ఈ సమయంలోనే గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ జిల్లాకు వచ్చారు. కేస్లాపూర్‌లో జరిగే జాతర గురించి తెలుసుకున్నారు. దీనిని గిరిజనుల సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చుకుని దర్బార్ ఏర్పాటు చేశాడు. ఇందులో గిరిజనుల సమస్యలపై చర్చించారు. హైమన్‌డార్ఫ్ 1946లో మొదటి దర్బార్‌ను నాగోబా జాతరలో నిర్వహించారు. అప్పటి నుంచి యేటా గిరిజనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ దర్బార్‌ను ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

గ్రామ కంఠానికి ఎసరు..

- తేజాపూర్‌లో రాత్రికి రాత్రే కబ్జాచేసి ప్లాట్లు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వెనక్కి తగ్గిన భూ బకాసురులు

రాత్రికి రాత్రే చదును చేసి ప్లాట్లు వేసిన కబ్జాదారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కొందరు భూ బకాసరులు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నరనడానికి ఇదే చక్కని ఉదాహరణ. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలాన్ని(గ్రామ కంఠం) ఆక్రమించేందుకు కొందరు కబ్జాదారులు యత్నించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. కొన్ని దశాబ్దాల క్రితం తేజాపూర్ గ్రామం ఏర్పడింది. సర్వే నంబరు.46లోని ప్రభుత్వ భూములను పేదలకు పంచగా, మిగిలిన సుమారు 3 ఎకరాలను గ్రామ అవసరాల కోసం వదిలేశారు. ఈ స్థలంలో గ్రామస్తులు సామూహిక కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. ప్రస్తుతం భూముల ధరలు పెరగడంతో కొందరు ఈ స్థలంపై కన్నేశారు. వారం క్రితం రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో చదునుచేసి ప్లాట్లు చేశారు. ఈ విషయమై ఆగ్రహించిన గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వెనక్కితగ్గిన కబ్జాదారులు ప్లాట్లు చేసిన స్థలాన్ని మళ్లీ ట్రాక్టర్లతో దున్నించి ప్లాట్ల కోసం వేసిన గుర్తులను చెరిపేశారు. గ్రామస్తులు సంఘటితంగా ఎదురుతిరగడంతో భూ బకాసురులు వెనక్కితగ్గారు.

కబ్జా చేయాలని చూసిన్రు

మా ముత్తాతల కాలంలో సర్వే నంబరు 46లో ఇండ్ల స్థలాలు ఇచ్చిన్రు. దాదాపు 3 ఎకరాలను గ్రామ అవసరాల కోసం ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో మేము దేవుని గుడిని కూడా కట్టుకున్నం. వారం కింద ఆసిఫాబాద్‌కు చెందిన కొంత మంది ఇక్కడ రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో చదును చేసి ప్లాట్లు వేసిన్రు. గ్రామస్తులందరం కలిసి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేసినం. దీంతో భయపడి వెనక్కి తగ్గిన్రు.

- వడాయి బాపూరావు, తేజాపూర్ గ్రామ పటేల్

ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8 : గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 11న నిర్వహించబోయే ప్రవేశ పరీక్షపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన, వెనుకబడిన తరగతులు, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆసిఫాబాద్‌లో 5 కేంద్రాలు, రెబ్బెనలో 1, సిర్పూర్ (టీ)లో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో స్వరూపారాణి, గిరిజన సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో గంగాధర్, జిల్లా సమన్వయకర్త బాలరాజు, చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో చేపట్టిన పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామపంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకోసారి క్లోరినేషన్ చేసి శుభ్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వైద్య పరీక్షలు

మెడికల్ టెస్ట్‌లో భాగంగా ప్రభుత్వ దవాఖానను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 8 : కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి పారదర్శకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో 5వ తేదీ నుంచి మెడికల్ టెస్ట్‌లు నిర్వహిస్తుండగా, ఆయన గురువారం పరిశీలించారు. ఇప్పటి వరకు 237 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు మెడికల్ టెస్ట్‌లు నిర్వహించినట్లు తెలిపారు. ఏఎస్పీ అచ్చేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, ఆర్‌ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐలు..

రెబ్బెన సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్ చిటిబాబు, ఆసిఫాబాద్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన జీ సతీశ్ ఎస్పీ సురేశ్‌కుమార్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. వారిని ఎస్పీ అభినందించారు.

కేటీఆర్‌ను కలిసిన జడ్పీ చైర్మన్ కృష్ణారావు


మాజీ మంత్రి కేటీఆర్‌తో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 8 : సిరిసిల్ల, సిద్దిపేట ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని వారు జడ్పీ చైర్మన్‌కు సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సంజయ్‌సింగ్ ఠాకూర్ ఉన్నారు.